సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



సేవలోనే సంతృప్తి

జీజీహెచ్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న వారిలో పలువురు నర్సింగ్ ఆఫీసర్లుగా ఉద్యోగం సాధించారు.

- IIలో ▸



వీవోఏలకు గుర్తింపుకార్డులు

ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏల వేతనాలు పెంచిన ప్రభుత్వం తాజాగా గుర్తింపు కార్డులు అందజేస్తోంది.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
32.3 /19.5

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలితీవ్రత కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

సదరం క్యాంపులు ఖరారు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో వికలాంగత్వ నిర్ధారణ కోసం ఏర్పాటు చేసే సదరం క్యాంపుల తేదీలు ఖరారయ్యాయి. ఫిబ్రవరి, మార్చి నెలలకు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరిలో 7, 21, 28 తేదీల్లో, మార్చిలో 13, 20, 27 తేదీల్లో క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రెండు నెలలకు నూతన స్లాట్లు 600, రెన్యువల్ స్లాట్లు 180 కలిపి మొత్తం 780 స్లాట్లను కేటాయించామన్నారు. ప్రతీ క్యాంపు తేదీ నాడు 130 స్లాట్లు ఉంటాయని తెలిపారు. దివ్యాంగులు ఈ నెల 3న స్థానిక మీ సేవా కేంద్రాల్లో స్లాట్లు బుక్ చేసుకోవాలని, ఆ రసీదులో సూచించిన తేదీల్లోనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో జరిగే క్యాంపులకు హాజరు కావాలని సూచించారు. రసీదుతో పాటు మెడికల్ రిపోర్టులు, స్కాన్, ఎక్స్‌రే, ఆధార్ పత్రాలు తీసుకొని రావాలని కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



నిజామాబాద్ అర్బన్: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం జరిగిన జనరల్ ప్రయోగ పరీక్షలకు 1,045 మంది విద్యార్థులకు 1,002 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,489 మందికి 1,193 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జనరల్‌లో 689మందికి 664 మంది, ఒకేషనల్‌లో 1,372 మంది విద్యార్థులకు 1,170 మంది పరీక్షలకు హాజరయ్యారు. డీఐఈవో రఘురాజ్ ఐదు కేంద్రాలను పరిశీలించారు.

వన్యప్రాణుల బాధితులకు పరిహారం



ఇందల్వాయి: ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో చిరుత పులి దాడుల్లో పశువులను కోల్పోయిన నలుగురికి అటవీ శాఖ తరఫున పరిహారం అందజేశారు. రేంజ్ కార్యాలయంలో బాధితులకు గురువారం రూ.97,500 పరిహారాన్ని అందించినట్లు ఎఫ్ఆర్వో రవి మోహన్ భట్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణుల దాడుల్లో పెంపుడు పశువులు చనిపోతే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించి పరిహారం పొందాలని సూచించారు. అంతేగాని వన్యప్రాణులకు హాని కలిగించొద్దన్నారు. డీఆర్వో శ్రీనివాస్, సెక్షన్ అధికారులు ఆనంద్, బాపురావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ టోర్నీకి నిఖత్



నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో పాల్గొననుంది. ఈ టోర్నీ బల్గేరియాలో ఈ నెల 2 నుంచి 12 వరకు జరగనుంది. ఇందులో ఆమె 50 కేజీల విభాగంలో తలపడనున్నారు. ఆమె విజయం సాధించాలని జిల్లాకు చెందిన క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

మిశ్రమ స్పందన

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వచ్చింది. గల్ఫ్ పాలసీ, ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ కొత్త రైల్వేలైన్‌పై ప్రస్తావన లేకపోవడం వలన కార్మిక కుటుంబాల్లో, ఆయా ఉమ్మడి జిల్లా వాసుల్లో నిరుత్సాహం నింపింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రెండు కోట్ల ఇళ్ల నిర్మాణ అంశం మధ్య తరగతి ప్రజలకు ఊరట నిచ్చింది. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలకు ఆయుష్మాన్ భారత్ పథకం వర్తింపు చేయనుంది. పన్ను మినహాయింపుల గురించి ప్రకటన లేకపోవడంతో వేతన జీవులు నిరాశ వ్యక్తం చేశారు.

అన్ని వర్గాలకు ప్రయోజనం



రైతులకు, ప్రభుత్వ ఉద్యోగులకు, పేదలకు, వ్యాపారులకు ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగకరంగా ఉంది. వికసిత్ భారత్ లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను పరిరక్షించే చారిత్రాత్మక బడ్జెట్. స్వయం సహాయక సంఘాల ద్వారా 3 కోట్ల మంది మహిళలను లక్షాధికారులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నరేంద్ర మోదీ పాలనలో 25 కోట్ల మంది భారతీయులకు పేదరికం నుంచి విముక్తి లభించింది. పేదలకు సొంతింటి కల నెరవేరుస్తూ వచ్చే ఐదు సంవత్సరాల్లో ఆవాస్ యోజన కింద రెండు కోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నారు. సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ వినియోగదారులకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతుంది. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలకు ఆయుష్మాన్ భారత్ పథకం వర్తింపు చేస్తారు. మౌలిక వసతుల కోసం రూ.11.11 లక్షల కోట్లు కేటాయించారు. ప్రపంచ దేశాలు ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నప్పటికీ వాటికి అతీతంగా మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి పథంలో పయనిస్తోంది.

– కులాచారి దినేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

సోలార్ గృహ విద్యుత్ దిశగా..

- కోటి ఇళ్లకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యం
- పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణం
- బాలికల్లో సర్వైకల్ క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్
- ప్రస్తావన లేని గల్ఫ్ పాలసీ.. వలస కార్మికుల్లో నిరాశ
- ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్‌పైనా ప్రస్తావనలేదు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: లోక్‌సభ ఎన్నికల ముందు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఎన్నికల తాయిలాలు అంతగా లేనప్పటికీ మధ్యతరగతి ప్రజలకు సంబంధించి నూతనంగా కోటి ఇళ్లకు రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్‌లో 300 యూనిట్లు సదరు ఇంటికి ఉచితంగా ఇచ్చాక, మిగిలిన విద్యుత్‌ను డిస్కంలకు సరఫరా చేసేలా పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా పీఎం ఆవాస్ యోజన పథకం కింద 2 కోట్ల ఇళ్లను నిర్మించేందుకు నిర్ణయించారు. 9–14 ఏళ్ల వయస్సు ఉన్న బాలికల్లో సర్వైకల్ క్యాన్సర్ రాకుండా నివారణకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. రైతులకు నానో యూరియా, డీఏపీ, ఎరువులు అందించేందుకు ప్లాన్ రూపొందించారు.

ఊసులేని గల్ఫ్ పాలసీ

ఉత్తర తెలంగాణలో అత్యధికంగా ఉన్న గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాలు ప్రత్యేక గల్ఫ్ పాలసీ కోసం డిమాండ్ చేస్తున్నాయి. అయితే దీనిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న

ఆర్మూర్ రైల్వే లైన్‌పై నిరాశ..

ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ కొత్త రైల్వేలైన్ విషయమై ప్రస్తావన లేకపోవడంతో నిరాశ వ్యక్తమవుతోంది. ఆదాయ పన్ను మినహాయింపులు గత ఏడాది మాదిరిగానే యథాతథంగా ఉంచడంతో వ్యాపారులు, ఉద్యోగులు నిట్టూరుస్తున్నారు.

సంక్షేమమే లక్ష్యంగా..



పేదలు, యువత, మహిళలు, రైతుల సంక్షేమం కోసం రూపొందించిన బడ్జెట్ ఇది. సమగ్ర వృద్ధిని సాధించి భారత్‌ను అభివృద్ధి వైపు నడిపించాలనేది ప్రధాని మోదీ ప్రభుత్వ సంకల్పం. 2047 నాటికి వికసిత్ భారత్ కల తప్పకుండా సాకారం చేస్తుంది. నారీశక్తి ద్వారా భారత్ పునాదిని బలోపేతం చేయడమే కాకుండా మహిళల స్వావలంబనను మరింత పెంచుతుంది. పంట అనంతర కార్యకలాపాలలో ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులను పెంపొందించడం ద్వారా మార్కెట్–అనుసంధానమైన ఫలితాలను అభివృద్ధి చేయడంలో సహాయ పడుతుంది. ఆత్మనిర్భర్ ఆయిల్ సీడ్స్ అభివృద్ధి చేయడం, ఆక్వా పార్కుల ఏర్పాటు, సమగ్ర డెయిరీ కార్యక్రమం ద్వారా రైతులు 2047 నాటికి వికసిత్ భారత్‌లో సమాన వాటాదారులుగా ఉంటారు. సాంకేతికంగా నిష్ణాతులైన యువతకు ప్రభుత్వం మద్దతుగా నిలుస్తోంది. 50 ఏళ్ల వడ్డీ లేని రుణంతో రూ.లక్ష కోట్ల కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయడంతో యువత పరిశోధన అభివృద్ధిని చేపట్టడానికి సహాయపడుతుంది.

– ధర్మపురి అర్వింద్, ఎంపీ

సాదాసీదా బడ్జెట్



కేంద్ర బడ్జెట్ సాదాసీదాగా ఉంది. ముఖ్యమైన మార్పులు ఏమి ప్రవేశపెట్టలేదు. కొత్త పన్ను విధానంలో స్లాబుల పెంపు, రిబేట్ ఏమీ ఇవ్వలేదు. విమానయాన రంగాన్ని దేశంలోని టూ టైర్, త్రీ టైర్ నగరాలకు, పట్టణాలకు కూడా విస్తరించాలన్న లక్ష్యాన్ని తీసుకోవడం అభినందనీయం. పునరుత్పాదక ఇంధనం అభివృద్ధిలో భాగంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు, విద్యుత్ తయారీ లాంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం సుస్థిర అభివృద్ధి వైపు అడుగులు వేయడమే. మౌలిక వసతుల కల్పనకు 11 లక్షల కోట్లు కేటాయించడం స్వాగతించవచ్చు. విద్యారంగానికి, వ్యవసాయ రంగానికి అనుకున్నంతగా కేటాయింపులు చేయలేదు.

– పాత నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెయూ

రెండు కోట్ల ఇళ్లు గాలిమాటలే..



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రెండు కోట్ల ఇళ్ల నిర్మాణం చేపడుతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. బీజేపీ ప్రభుత్వంలో గతంలో రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన విధంగానే ఇప్పుడు ఇళ్ల విషయంలో గాలి మాటలు చెప్పింది. జిల్లాలో పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేస్తారని ఇప్పటి వరకు స్పష్టత లేదు. రైతులను మభ్యపెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందడానికే పసుపు బోర్డు డ్రామా ఆడుతున్నారు.

– మానాల మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, నిజామాబాద్

వ్యవసాయ రంగానికి అనుకూల బడ్జెట్



బడ్జెట్‌లో వ్యవసాయం, రైతుల సంక్షేమానికి రూ.1.27 లక్షలు కోట్లు కేటాయించారు. వ్యవసాయ రంగంలో మరింత వృద్ధి కోసం పబ్లిక్, ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యోజన ద్వారా 2.4 లక్షల స్వయం సహాయక బృందాలు, వ్యక్తిగతంగా మరో 60 వేల మందికి రుణ సాయం అందించినట్లు చెప్పారు. రైతులకు నష్టాల నివారణ, దిగుబడి ఆదాయం పెంపు కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీంతో రైతులకు మేలు జరుగుతుంది.

– సంపత్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెయూ

నకిలీ సర్టిఫికెట్‌లతో పాస్‌పోర్టులు!

జిల్లాలో ఎస్‌బీ ఏఎస్సై అరెస్ట్‌తో కలకలం



ఖలీల్‌వాడి: జిల్లాలో నకిలీ సర్టిఫికెట్‌లతో పాస్‌పోర్టులు జారీ కావడం, ఇందులో ఎస్‌బీ ఏఎస్సై లక్ష్మణ్ అరెస్ట్ కావడం చర్చనీయాంశంగా మారింది. మూడేళ్ల క్రితం బోధన్‌లో ఒకే ఇంటి అడ్రస్‌పై 70 పాస్‌పోర్టులు జారీ అయ్యాయి. ఈ ఘటనలో ఎస్‌బీ ఎస్సై అరెస్టయ్యారు. తాజాగా నకిలీ సర్టిఫికెట్లతో పాస్‌పోర్టుల వ్యవహారంలో వెలుగు చూసింది. ఇందులో భీమ్‌గల్‌కు చెందిన సుభాష్, ఎస్‌బీ ఏఎస్సై లక్ష్మణ్‌ను సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకోవడంతో ఎస్‌బీలో కలకలం రేపుతుంది. లక్ష్మణ్‌ను విచారించిన అధికారులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనల్లో ఎస్‌బీ పోలీసులు ఉండటంతో నకిలీ సర్టిఫికెట్లతో పాస్‌పోర్టులు జిల్లాలో పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఈసీఎన్ఆర్ పాస్‌పోర్టు కోసం..

పాస్‌పోర్టులను రెండు రకాలుగా జారీ చేస్తారు. ఈసీఆర్ పాస్‌పోర్టును ఆధార్‌కార్డు ద్వారా తీసుకుంటారు. ఇది లేబర్ వీసాలకు మాత్రమే వర్తిస్తుంది. ఈసీఎన్ఆర్ పాస్‌పోర్టుకు తప్పని సరిగా విద్యార్హతలు పెట్టాల్సి ఉంటుంది. బతుకు దెరువు కోసం జిల్లా నుంచి ఎక్కువగా గల్ఫ్ దేశాలకు వెళ్తారు. అయితే వీరిలో కొందరికి ఎడ్యుకేషన్ లేకపోవడంతో వర్క్ వీసా రాదని భావించి బ్రోకర్లు, పాస్‌పోర్టు ఏజెంట్‌లను ఆశ్రయిస్తున్నారు. వారు అన్ని సర్టిఫికెట్లతో ఈసీఎన్ఆర్ పాస్‌పోర్టు ఇప్పిస్తామని రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. పాస్‌పోర్టు ఆఫీస్‌లో వెరిఫికేషన్ అయిన తర్వాత ఎస్‌బీ పోలీసులతో బేరసారాలు చేసుకొని పాస్‌పోర్టులు ఇప్పిస్తున్నారు.

వెలుగులోకి కీలక విషయాలు

నకిలీ సర్టిఫికెట్‌లతో పాసుపోర్టుల తయారీ వ్యవహారంలో సీఐడి అధికారులకు కీలక విషయాలు తెలిశాయి. దరఖాస్తుదారుడి ఆధార్ కార్డు, ఓటరు ఐడీ కార్డు, పదో సర్టిఫికెట్‌లను కంప్యూటర్‌లో మార్పులు చేర్పులు చేసి వాటిపై పాఠశాలకు సంబంధించిన స్టాంపులను నకిలీవి చేయించి అతికించారు. ఇది కోరుట్ల, హైదరాబాద్ కేంద్రంగా జరిగి నట్లు అధికారులు గుర్తించారు.

ఎంక్వైరీ పేరిట వసూళ్లు..

వెరిఫికేషన్‌కు సమయంలో పోలీసులు దరఖాస్తుదారుడి వద్ద రూ.వెయ్యి నుంచి రూ.ఐదు వేల వరకు వసూలు చేస్తారని ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు తీసుకొని నామమాత్రంగా వెరిఫికేషన్ చేస్తారనే విమర్శలు ఉన్నాయి.

ఒక్కొక్కరికి రెండు జీపీలు

- పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించిన ప్రభుత్వం
- తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని ఆదేశం



సుభాష్‌నగర్: గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. గెజిటెడ్, సూపరింటెండెంట్ హోదా కలిగిన అధికారులనే నియమించారు. ఈ క్రమంలో కొందరికి రెండు గ్రామ పంచాయతీల బాధ్యతలను అప్పగించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేకాధికారుల నియామక ప్రక్రియ పూర్తిచేశారు. ప్రభుత్వ ఆదేశానుసారం తక్షణమే ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

272 మంది అధికారులకు..

జిల్లాలో 530 గ్రామపంచాయతీలు ఉండగా గెజిటెడ్, సూపరింటెండెంట్ స్థాయి కలిగిన 272 మందిని ప్రత్యేకాధికారులుగా నియమించారు. మొదట గెజిటెడ్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, హెచ్ఎంలను ప్రత్యేకాధికారులుగా నియమించాలని జాబితాను పంపించారు. కానీ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో చివరి నిమిషంలో మార్పులు చేశారు. కేవలం గెజిటెడ్, సూపరింటెండెంట్ స్థాయి అధికారులను మాత్రమే నియమించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతో ఎంపీడీవోలు మరో జాబితాను సిద్ధం చేసి కలెక్టర్, డీపీవోలకు పంపించారు. ఒక్కో అధికారికి రెండేసి పంచాయతీల బాధ్యతలు అప్పగించారు.

రెండ్రోజుల్లో రికార్డులు, డిజిటల్ కీ..

ప్రస్తుత పాలకవర్గం నుంచి రికార్డులు, డిజిటల్ కీలను రెండ్రోజుల్లో ప్రత్యేకాధికారులు స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రత్యేకాధికారులు తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. చెక్ పవర్ ప్రత్యేకాధికారితోపాటు పంచాయతీ కార్యదర్శికి ఇచ్చారు. కాగా పంచాయతీ అధికారాలు, బాధ్యతలు, విధులు గురించి ఫిబ్రవరి 3న వారికి శిక్షణ ఇవ్వనున్నారు.

నిధుల కొరత

జిల్లాలోని పంచాయతీలకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.60కోట్ల వరకు 15వ ఆర్థికసంఘం, స్టేట్ ఫైనాన్స్ నుంచి రావాల్సి ఉంది. ప్రస్తుతం జీపీలకు నిధుల కొరత తీవ్రంగా ఉంది. ప్రత్యేకాధికారులు, కార్యదర్శుల పాలనకు నిధుల కొరత తోడైతే సమస్యలు పేరుకుపోయే ఆస్కారముంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు నిధులు సకాలంలో జమ కాకపోయినా.. సర్పంచులు సొంత డబ్బులతో పనులు చేయించారు. కానీ ప్రస్తుతం జీపీల్లో నిధులు నిండుకున్న నేపథ్యంలో తక్షణ సమస్యల పరిష్కారం, కార్మికుల వేతనాలు, ఇతరత్ర అవసరాలకు నిధులు ఎక్కడి నుంచి తీసుకొస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

జింక్ కొంటేనే యూరియా!

- జిల్లాలో డీలర్ల ఇష్టారాజ్యం
- రైతులను నిలువుదోపిడీ చేస్తున్న వ్యాపారులు
- 'మామూలుగా' వ్యవహరిస్తున్న వ్యవసాయ శాఖ

గంగారాం అనే రైతు ఇటీవల జిల్లాలోని ఒక డీలరు వద్దకు వెళ్లాడు. ఒక బస్తా యూరియా కావాలని అడిగాడు. యూరియా కావాలంటే ఒక జింక్ ప్యాకెట్ తప్పనిసరిగా కొనాలని వ్యాపారి స్పష్టం చేశారు. నాకు జింక్ అవసరం లేదని రైతు చెప్పగా, యూరియా లేదని డీలరు కరాఖండిగా చెప్పాడు. దీంతో వేరే గతిలేక యూరియాతో పాటు జింక్‌ను కూడా కొనుగోలు చేశాడు. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా చాలామంది వ్యాపారులు యూరియాతో పాటు ఇతర మందులను కూడా బలవంతంగా రైతులకు అంటగడుతున్నారు.

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయించే వ్యాపారులు రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల అండ ఉందనే ధీమాతో నిబంధనలకు విరుద్ధంగా యూరియా అమ్మకాలు జరుపుతున్నారు. యూరియా కావాలంటే 'జింక్' ప్యాకెట్లు కూడా తీసుకోవాల్సిందేనని రైతులకు స్పష్టం చేస్తున్నారు. లేకపోతే యూరియా లేదని చెబుతున్నారు. దీంతో వేరే గతిలేక, అవసరం లేకున్నా 'జింక్'ను కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 480కి పైగా ఫర్టిలైజర్స్, 600 వరకు సీడ్స్, 350కి పైగా పెస్టిసైడ్స్ దుకాణాలు లైసెన్సులు కలిగి ఉన్నాయి. వీటిలోనే పంట పొలాలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతులు కొనుగోలు చేస్తున్నారు. అయితే, వ్యాపారులు అడ్డదారులు తొక్కకుండా వ్యవసాయాధికారులు వీటిని పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కానీ కొంతమంది అధికారులే వీరికి కొమ్ముకాస్తుండడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రైతులు తీసుకునే యూరియాకు జింక్‌ను అంటగట్టడమే కాకుండా నాణ్యతలేని ప్రైవేటు కంపెనీల విత్తనాలు, మందులు ఎక్కువ ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అదే విధంగా బస్తాలకు బదులు రైతులు బయో యూరియాను తీసుకునేలా ప్రోత్సహించడంలో ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదు. యూరియాను పొలాల్లో చల్లడంతో నేలకు నష్టం జరగడంతో పాటు వాతావరణం దెబ్బతినే అవకాశం ఉంది. యూరియా గుళికల రూపంలో కాకుండా ద్రవరూపంలో తయారు చేసిన బాటిళ్లు మార్కెట్లోకి వచ్చి చాలా రోజులవుతోంది. దీనిని వినియోగిస్తే నేలకు, పంటకు మంచిదని పరిశోధనలు చెబుతున్నాయి.



చర్యలు తీసుకుంటాం

రైతులు కొనుగోలు చేస్తున్న యూరియా బస్తాలతో పాటు జింక్ ప్యాకెట్లు తీసుకోవాలని నిబంధన ఎక్కడా లేదు. డీలర్లు, వ్యాపారులు ఈ విధంగా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అడ్డదారులు తొక్కిన వారికి అధికారులు సహకరిస్తే ఉపేక్షించేది లేదు. రైతులకు బయో యూరియాను ప్రోత్సహించాలి.

– వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయ అధికారి

సీజన్ వారీగా ముడుపులు..

ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను విక్రయించే దుకాణాలు జిల్లాలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అర్హతను చూసి అడిగిన వారందరికీ వ్యవసాయ శాఖ లైసెన్సులు ఇస్తోంది. అయితే, లైసెన్సులు పొందాలంటే కూడా మండల, డివిజన్, జిల్లా స్థాయిలో అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పాల్సిందే. ఇదిలా ఉండగా, సీడ్స్, ఫర్టిలైజర్స్ దుకాణాలకు ఏడాదికోసారి లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ సమయంలో కూడా డీలర్లు అధికారులను ప్రసన్నం చేసుకుని వారి మన్ననలను పొందుతున్నారు. అదే విధంగా పట్టణాలు, మండలాలు, గ్రామ స్థాయిలో ఉండే దుకాణాల్లో వ్యాపారులు తమకు నచ్చిన విధంగా విక్రయాలు చేసుకోవడానికి ఖరీఫ్, రబీ సీజన్ల వారీగా భారీగానే ముడుపులు అప్పజెబుతూ వస్తున్నారు. దీంతో అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఒకవేళ ఫిర్యాదులు అందినా కూడా తూతూ మంత్రంగానే చర్యలు తీసుకుంటున్నారు.

ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు



కిషన్‌రెడ్డికి దరఖాస్తు అందజేస్తున్న జ్ఞానేందర్ గుప్తా



రేవంత్‌రెడ్డితో ఆకుల లలిత

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ లోక్‌సభ ఎంపీ బీజేపీ టికెట్ కోసం నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారస్తుడు, మంచాల శంకరయ్య గుప్తా ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ గుప్తా దరఖాస్తు చేసుకున్నారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డిని కలిసి దరఖాస్తు అందించారు. గత పదేళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్న తనకు పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరారు. జ్ఞానేందర్ గుప్తాతో పాటు ఎస్సీ కమీషన్ మాజీ సభ్యుడు కేశపల్ల రాములు, మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

సీఎంను కలిసిన ఆకుల లలిత

ఖలీల్‌వాడి: హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత మర్యాదపూర్వకంగా కలిశారు. నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా తనను పరిగణించాలని ఆమె కోరారు. అనంతరం ఆమె గాంధీభవన్‌లో నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా తన పేరును దరఖాస్తు చేసుకున్నారు. ఆమె వెంట గడీల రాములు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ధర్పల్లి మాజీ ఎంపీపీ గోపి..

ఇందల్వాయి: నిజామాబాద్ ఎంపీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని ధర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమ్మడి గోపి కోరారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి శరత్ గౌడ్‌కి ఎంపీ టికెట్ కోసం గురువారం ఆయన దరఖాస్తు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. తెలంగాణలో అన్ని ఎంపీ సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు.

క్లుప్తంగా

హైదరాబాద్‌లో ఆల్ ఇండియా నర్సరీ మేళా

డొంకేశ్వర్(ఆర్మూర్): హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో ఈ నెల 1వ తేదీ నుంచి 5 వరకు ఆల్ ఇండియా నర్సరీ మేళా జరగనుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నర్సింగ్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో దేశం నలుమూలల నుంచి 140కి పైగా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. పూలు, పండ్ల రకాల మొక్కలను ప్రదర్శనలో ఉంచుతున్నట్లు వివరించారు. జిల్లా వాసులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గురుకుల పాఠశాల విద్యార్థిని నేహ జాతీయస్థాయి అండర్–14 స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగీత గురువారం తెలిపారు. ఈ నెల 3 నుంచి 7వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో నేహ పాల్గొంటుందన్నారు. అనంతరం విద్యార్థిని నేహను ప్రిన్సిపాల్ సంగీత, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, పీఈటీ జ్యోత్స్న, హౌస్ టీచర్ చెన్నకేశ్వరి తదితరులు అభినందించారు.

ముగిసిన విద్యుత్ స్తంభం పరీక్షలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని పవర్‌హౌస్‌లో నిర్వహిస్తున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూనియర్ లైన్‌మన్ అభ్యర్థుల విద్యుత్ స్తంభం పరీక్షలు గురువారం ముగిశాయి. ఈ పరీక్షలను విద్యుత్‌శాఖ సీజీఎం మధుసూదన్ పరిశీలించారు. 33మంది అభ్యర్థులకు 32 మంది స్తంభం ఎక్కగా ఒక్కరు గైర్హాజరయ్యారు. డీఈటీ వెంకటరమణ, డీఈలు సాలియానాయక్, అధికారులు ఉన్నారు.

కొటార్మూర్‌లో సర్వే పరిశీలన

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్ నుంచి చేపట్టనున్న 63వ నంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేపడుతున్న సర్వేను అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి గురువారం పరిశీలించారు. ఆర్మూర్ నుంచి మోర్తాడ్ మండలం వరకు ఆర్డీవో వినోద్ కుమార్‌తో కలిసి సర్వే పరిశీలన చేపట్టారు. సర్వే త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సర్వే అండ్ ల్యాండ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శికారి రాజు, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

కేంద్ర బడ్జెట్ మధ్య తరగతిని ఆకట్టుకునేలా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బస్తీల్లో ఉంటున్న వారికి సొంత ఇళ్లు కట్టుకునేందుకు కొత్త పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో గురువారం వెల్లడించారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా బడ్జెట్‌పై పలువురు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.



ఎన్నికల కోసమే బడ్జెట్



కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కోసమే బడ్జెట్ ప్రవేశపెట్టింది. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు లాభం లేదు. ఎన్నికల్లో లబ్ధి పొంది మళ్లీ అధికారంలోకి రావడానికి అంకెల గారడీ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించలేదు.

– సుధాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి, నిజామాబాద్

ప్రజల ఆశలపై నీళ్లు



ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సామాన్య మధ్య తరగతి ప్రజానీకాన్ని తీవ్ర నిరాశకు గురి చేసింది. ఎలాంటి ధరల తగ్గింపు ప్రస్తావన చేపట్టలేదు. కేంద్ర బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్న సామాన్య ప్రజల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

– రమేశ్‌బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి, నిజామాబాద్

షుగర్ ఫ్యాక్టరీల ఊసేలేదు



బోధన్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో షుగర్ ఫ్యాక్టరీల ఊసేలేదు. ఫ్యాక్టరీల అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్న కేంద్రం మాట తప్పింది. ఇథనాల్ ఫ్యాక్టరీలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించారు.

– ఉపేందర్, మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి

అభివృద్ధి దేశంగా భారత్..



ఆర్మూర్: 2047 నాటికి పేదరికం కనబడకుండా చేయాలన్న లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించడం అభినందనీయం. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఈరవత్రి రాజశేఖర్, చార్టెడ్ అకౌంటెంట్, ఆర్మూర్

ఇక పల్లెలు ప్రగతివైపు..



ఆర్మూర్: గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.ఒక లక్ష77 వేల కోట్లు కేటాయించడంతో పల్లెలు ప్రగతి వైపు పయనిస్తాయి. ఈ నిధులను పూర్తి స్థాయిలో గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– గుండోజి నరేందర్, ఉపాధ్యాయుడు, ఆర్మూర్

కరెంటు కష్టాలు లేని దేశంగా..



ఆర్మూర్: కరెంటు కష్టాలు లేని దేశ నిర్మాణానికి కట్టుబడ్డ కేంద్రం దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లపై రూఫ్ టాప్ సోలార్ సెటప్స్ ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం శుభపరిణామం. ప్రతీ కుటుంబానికి ఏడాదికి రూ.15 వేలు ఆదా అవుతుంది.

– రమేశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్మూర్

పసుపు బోర్డు ప్రస్తావన లేదు



ఆర్మూర్: జిల్లా రైతాంగం పసుపు బోర్డుపై ఎన్నో ఆశలు పెట్టుకుంది. కేంద్ర ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పసుపు బోర్డు ప్రస్తావన లేకపోవడం విచారకరం. కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపుపై పునరాలోచన చేయాలి.

– పెద్దకాపు రాజు, రైతు, పెర్కిట్

మధ్యతరగతికి మొండి చేయి



నిజామాబాద్‌నాగారం: పేద, మధ్యతరగతి ప్రజలను మోసం చేసేలా కేంద్ర మధ్యంతర బడ్జెట్ ఉంది. ఆదాయపు పన్ను రూ. 10 లక్షల వరకు మినహాయింపు ఇస్తారని మధ్యతరగతి వర్గం ఆశించిందని కానీ ఎలాంటి మార్పులు లేకుండా మొండి చేయి చూపింది.

– రామ్మోహన్‌రావు, పింఛన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

సేవలోనే సంతృప్తి

- జీజీహెచ్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తూనే రెగ్యులర్ ఉద్యోగాలు
- నర్సింగ్ ఆఫీసర్ల మనోగతం..

నిజామాబాద్‌నాగారం: నర్సింగ్ వృత్తిలో ఉన్న వారికి అది ప్రభుత్వ ఉద్యోగమైనా.. ప్రైవేటైనా అంతులేని సంతృప్తిని మిగులుస్తుంది. రోగికి సేవ చేయడమే తమకు దక్కిన అదృష్టమని భావిస్తూ ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తారు నర్సింగ్ ఆఫీసర్లు. ప్రేమ, సేవ కలగలిసిన వృత్తిలో కొనసాగడానికి మించిన సంతృప్తి ఇంకేముంటుందని అంటున్నారు. ఇటీవల జిల్లాలో 380 మంది నర్సింగ్ ఉద్యోగాలు సాధించగా, జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న 104 మంది వారిలో ఉన్నారు. జీజీహెచ్‌లో మొత్తం 120 మంది కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తుండగా, 104 మంది రెగ్యులర్ ఉద్యోగాలు సాధించారు. ఓ పక్క ప్రభుత్వ దవాఖానలో విధులు నిర్వర్తిస్తూనే.. నిరంతర శ్రమ, పట్టుదల, రోగులకు సేవ చేయాలనే తపనతో నర్సింగ్ ఆఫీసర్లుగా రెగ్యులర్ ఉద్యోగాలు సాధించిన వారి మనోగతం ఇలా..

నా భర్త, నేను కలిసి సాధించాం



ప్రభుత్వ ఉద్యోగం సాధించానికి చాలా కష్టపడ్డాను. ఒక పక్క కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తూనే మరో పక్క చదువుకున్నాను. ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యంతో ముందుకు వెళ్లాను. ఆలస్యంగానైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది. నేను నా భర్త కలిసి సాధించడం చాలా సంతోషంగా ఉంది.

– రెహానా బేగం, నర్సింగ్ ఆఫీసర్

అనుకున్నది సాధించాను



నేను కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగంలో చేరాను. అయినా వచ్చే జీతం తక్కువ కావడంతో కుటుంబం నడవడం చాలా కష్టంగా ఉండేది. పెరిగిన ధరలకు చేతికందే జీతం సరిపోయేది కాదు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదివి అనుకున్నది సాధించాను. రోగులకు సేవ చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగం సాధించడం గర్వంగా ఉంది.

– భరత్ రాహుల్‌రాజ్, నర్సింగ్ ఆఫీసర్

ప్రాణాలకు తెగించి సేవ చేశా



కాంట్రాక్ట్ ప్రాతిపదికన 2017లో ప్రభుత్వ దవాఖానలో ఉద్యోగంలో చేరా. కొవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించా. నా ప్రాణాలను, కుటుంబాన్ని రిస్క్‌లో పెట్టి విధులకు హాజరయ్యా. విధులు నిర్వహిస్తూనే మరో పక్క హార్డ్‌వర్క్ చేశాను. కుటుంబ సహకారంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాను.

– రజిని, నర్సింగ్ ఆఫీసర్

రోగులకు సేవ చేయడం అదృష్టం



నర్సింగ్ విద్యను ఎక్కువగా అమ్మాయిలే అభ్యసిస్తారు. ఈ రంగంలో బాలురు తక్కువగా ఉంటారు. రోగులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. అందుకే అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ అని ఆలోచించకుండా రోగులకు సేవలందించా. నర్సింగ్ విద్యను పూర్తి చేసి కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగం సాధించాను.

– సతీశ్, నర్సింగ్ ఆఫీసర్

ఓ వైపు పిల్లలు మరోవైపు ఉద్యోగం



నేనూ నా భార్య ఇద్దరం ఉద్యోగాలు సాధించాం. మాకు ఇద్దరు పిల్లలున్నారు. ఇద్దరం ఉద్యోగం చేస్తూ, పిల్లలను చూసుకుంటూ చదువుకున్నాం. ఇద్దరికీ ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. నా భార్య రెహానాబేగం కామారెడ్డి జిల్లాకు, నేను నిజామాబాద్‌కు వస్తాము. పోస్టింగ్ ఎక్కడైనా ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది.

– ఉమేర్, నర్సింగ్ ఆఫీసర్

వీవోఏలకు 'గుర్తింపు' కార్డులు

డొంకేశ్వర్: ఐకేపీలో పని చేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు (వీవోఏ) ఇటీవల వేతనాలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా వారికి 'గుర్తింపు' కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. రాష్ట్ర సెర్ప్ శాఖ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఉన్న వీవోఏలకు ట్యాగ్‌తో కూడిన గుర్తింపులు కార్డులు జారీ చేస్తున్నారు. వీటిని తయారు చేసేందుకు అయ్యే ఖర్చును ఆయా మండల సమాఖ్యల నుంచి చెల్లించాలని ఆదేశాలు ఉన్నాయి. మండలాల్లోని ఏపీఎంలు వీవోఏలకు గుర్తింపు కార్డులను అందజేయడానికి వారి ఫొటోలు, వివరాలు సేకరించారు. ఇప్పటికే పలు మండలాల్లో పంపిణీ కూడా పూర్తయింది. జిల్లాలో 806 మంది వీవోఏలు ఉండగా, వీరు గ్రామ సంఘాలను నిర్వహించి రుణాల మంజూరు, రివకరీతో పాటు రికార్డుల నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. ఐతే, ఈ గుర్తింపులు కార్డులు వీలైనంత త్వరగా వీవోఏలకు అందజేస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ నాయక్ 'సాక్షి'కి తెలిపారు.



గుర్తింపు కార్డులు అందజేస్తున్న అధికారులు

విద్యార్థులకు అభినందన



కామారెడ్డి అర్బన్: పట్టణానికి చెందిన ఆర్కిడ్స్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్ గోవర్ధన్‌రెడ్డి గురువారం తెలిపారు. విద్యార్థులు వి.మధుప్రియ, వై.మనీష్ రాష్ట్ర స్థాయి రగ్బీకి ఎంపికైయ్యారని, పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పదో తరగతి పరీక్షలకు సిద్ధం కావాలి

- డీఈవో దుర్గా ప్రసాద్

బోధన్: పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు సిద్ధం కావాలని డీఈవో దుర్గా ప్రసాద్ హెచ్‌ఎంలను ఆదేశించారు. వార్షిక పరీక్షలు మార్చి 18 నుంచి 31 వరకు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. పదోతరగతి పరీక్షల నిర్వహణపై గురువారం పట్టణ కేంద్రంలోని డిప్యూటీ డీఈవో ఆఫీసులో డివిజన్ స్థాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. డ్రాఫ్ అవుట్స్ విద్యార్థులు లేకుండా హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో నోడల్ ఆఫీసర్ వనిత, ప్లానింగ్ కో–ఆర్డినేటర్ శ్రీధర్, సీఎంవోలు శ్రీనివాస్, జీవన్, ఎంఈవోలు నాగ్‌నాథ్, శాంతకుమారి, రామారావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో దుర్గా ప్రసాద్

క్రైం కార్నర్

రైలు కింద పడి వృద్ధురాలి మృతి



నవీపేట: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు కిందపడి స్టేషన్ ఏరియాకు చెందిన రత్నావత్ శృతి అలియాస్ గుండిబాయి(60) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్ గురువారం తెలిపారు. కాచిగూడ నుంచి నాగర్‌సోల్‌కు వెళ్తున్న రైలులో తినుబండారాల ప్యాకెట్లు విక్రయించే వృద్ధురాలు ఒక బోగీ నుంచి మరో బోగీలో ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి రైలు కిందపడి మృతి చెందిందన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..



బీబీపేట: బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని యాడారంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సంఘమేశ్వర్(46) మూడు రోజుల క్రితం బీబీపేటకు వచ్చి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మోపాల్: మండలంలోని కంజర్ శివారులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. గురువారం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కంజర్ గ్రామానికి చెందిన పిల్లి భూమారావు మోపాల్ నుంచి వస్తుండగా, కులాస్‌పూర్‌కు చెందిన పసుల శేఖర్ తన భార్య, చిన్నమ్మతో మోపాల్ వైపు వస్తుండగా కంజర్ శివారులో బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో శేఖర్, ఆయన భార్య, చిన్నమ్మకు గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై గంగాధర్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రూ.1.50 లక్షలకు టోకరా..

కామారెడ్డి క్రైం: సైబర్ మోసాలపై పోలీసులు ఎంత అవగాహన కలిపిస్తున్నా ఏదో చోట జరుగుతూనే ఉంది. మోసగాళ్లు కొత్తదారుల్లో వస్తూ డబ్బులు కాజేస్తున్నారు. ఇలాంటిదే పట్టణంలో గురువారం వెలుగు చూసింది. భాను ప్రకాశ్ అనే వ్యక్తికి రెండు రోజుల క్రితం ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ ఐసీసీఐ క్రెడిట్ కార్డుకు సంబంధించిన ఇంటర్‌నేషనల్ ట్రాన్సాక్షన్ ఆన్‌లో ఉందన్నాడు. ఆఫ్ చేయాలంటే తాను చెప్పిన విధంగా చేయాలన్నాడు. అతను చెప్పినటూల్ల ప్లేస్టోర్‌లో ఐ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని క్రెడిట్ కార్డు వివరాలు ఇవ్వగానే అతని అకౌంట్‌లో నుంచి రూ.1.50 లక్షలు కట్ అయ్యాయి. మోసపోయినట్లు గుర్తించి పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

బస్సులో బంగారం చోరీ

ఎడపల్లి/బోధన్ టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గుండ్లు చోరీకి గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. డిచ్‌పల్లి మండలం రాంపూర్‌కు చెందిన పోసాని రుద్రూర్‌లో బంధువుల శుభాకార్యం నిమిత్తం గురువారం వెళ్లింది. తిరుగు ప్రయాణంలో బోధన్ బస్టాండ్‌లో నిజామాబాద్‌కు వచ్చే బస్సు ఎక్కింది. బస్సు ఎక్కినప్పుడు మెడలో ఉన్న రెండు తులాల బంగారు గుండ్లు ఎడపల్లి ప్రాంతంలో చూసే సరికి కనిపించలేదు. దీంతో బాధితురాలు డ్రైవర్, కండక్టర్‌కు చెప్పడంతో వారు బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ప్రయాణికులను తనిఖీ చేయగా బంగారం లభించలేదు. దీంతో బాధితురాలిని బోధన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.



బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

మహిళల సొమ్ము హాంఫట్..

- రూ. 6 లక్షల సొమ్ము కాజేసిన కెనరా బ్యాంక్ కరస్పాండెంట్

వర్ని: డ్వాక్రా సంఘం మహిళలు ప్రతి నెలా జమ చేస్తున్న రూ. 6లక్షల60వేల నగదును ఓ ప్రబుద్ధుడు తనదైన శైలిలో హాంఫట్ చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సైడిమల్ గ్రామానికి చెందిన జైభవాని గ్రూపు సభ్యులు 25 నెలలుగా గ్రామంలో ఏర్పాటు చేసిన కెనరా సర్వీస్ బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తున్నారు. ఈ సర్వీసు బ్యాంక్‌ను అదే గ్రామానికి చెందిన కృష్ణ నిర్వహిస్తుండగా అతనికి గత 25 నెలలుగా సంఘ సభ్యులు నగదును అందజేస్తున్నారు. వారికి నామమాత్రపు రసీదులు ఇచ్చి నగదు బ్యాంకులో జమ అయిందని చెప్పేవాడు.


ఈ విషయమై బ్యాంకులో సభ్యులు విచారణ చేయగా ఖాతాలో జీరో బ్యాలెన్స్ ఉండడంతో కృష్ణను ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రూప్ రెండో లీడర్ వడ్ల బాలమణి, సభ్యులు తెలిపారు.

కొరట్‌పల్లి తండాలో ఇద్దరి అరెస్ట్



ఆర్మూర్‌టౌన్: డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లి తండాలో సారా కాస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ గురువారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించగా సారా, బెల్లం పానకం లభ్యమైనట్లు చెప్పారు. నిషేధిత సారా కాస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆయన వెంట ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బేకరీలో కుళ్లిన కేక్‌లు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని డాల్ఫిన్ బెంగళూరు బేకరీలో కుళ్లిన కేక్‌లు విక్రయిస్తుండడంతో పలువురు ఆందోళనకు దిగారు. గురువారం పుట్టినరోజు వేడుకల కోసం ఓ కస్టమర్ బేకరీ నుంచి కేక్ తీసుకెళ్లాడు. అది తిన్న బాధితులకు వాంతులయ్యాయి. ఈ విషయమై బేకరీ నిర్వాహకుడిని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు బాధితులు తెలిపారు. ఆర్మూర్ ఇన్‌చార్జి కమిషనర్ భూమేశ్వర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌కు ఫిర్యాదు చేయడంతో వారు కుళ్లిన కేకులను పరిశీలించారు. తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

రాజంపేట: డ్రంకన్ డ్రైవ్‌లో మండల కేంద్రానికి చెందిన మ్యాదరి లక్ష్మణ్‌కు రెండో తరగతి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష, రూ. 200 జరిమానా విధించినట్లు ఎస్సై సంపత్ గురువారం తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని అన్నారు.

అనుమానితుల పట్టివేత

తాడ్వాయి: మండలంలోని కన్‌కల్ గ్రామంలో భిక్షాటన పేరిట తిరుగుతున్న నలుగురు అనుమానిత మహిళలను గ్రామస్తులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు గురువారం తరలించారు. ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన వీరు గ్రామంలో బియ్యం, నగదు పేరిట భిక్షాటన చేస్తున్నారు. వీరి ప్రవర్తపై అనుమానం వచ్చిన గ్రామస్తులు వారిని నిలదీశారు. మీరు భిక్షాటన కోసం రాలేదని చిన్నపిల్లలను దొంగిలించేందుకు వచ్చారంటు వారిని పట్టుకొని పీఎస్‌కు తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కామారెడ్డి క్రైం: పట్టణంలోని పెద్ద బజార్‌లో ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన ఫర్హానా బేగం బుధవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి పిల్లలతో పక్క కాలనీలో ఉండే తల్లిగారి ఇంటికి వెళ్లింది. గురువారం సాయంత్రం వచ్చి చూసేసరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. 2 తులాల బంగారం, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితురాలు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: కోటగిరి మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక అశోక్ లేలాండ్ వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ గురువారం తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీలో పట్టుకున్నట్లు చెప్పారు. అనంతరం వాహనాలను సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు.



సేవలోనే సంతృప్తి
జీజీహెచ్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న వారిలో పలువురు నర్సింగ్ ఆఫీసర్లుగా ఉద్యోగం సాధించారు.
- IIలో ▸



వీవోఏలకు గుర్తింపుకార్డులు
ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏల వేతనాలు పెంచిన ప్రభుత్వం తాజాగా గుర్తింపు కార్డులు అందజేస్తోంది.
- IIలో ▸

గరిష్టం/కనిష్టం
32.3 /19.5

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలితీవ్రత కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

సదరం క్యాంపులు ఖరారు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో వికలాంగత్వ నిర్ధారణ కోసం ఏర్పాటు చేసే సదరం క్యాంపుల తేదీలు ఖరారయ్యాయి. ఫిబ్రవరి, మార్చి నెలలకు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరిలో 7, 21, 28 తేదీల్లో, మార్చిలో 13, 20, 27 తేదీల్లో క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రెండు నెలలకు నూతన స్లాట్లు 600, రెన్యువల్ స్లాట్లు 180 కలిపి మొత్తం 780 స్లాట్లను కేటాయించామన్నారు. ప్రతీ క్యాంపు తేదీ నాడు 130 స్లాట్లు ఉంటాయని తెలిపారు. దివ్యాంగులు ఈ నెల 3న స్థానిక మీ సేవా కేంద్రాల్లో స్లాట్లు బుక్ చేసుకోవాలని, ఆ రసీదులో సూచించిన తేదీల్లోనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో జరిగే క్యాంపులకు హాజరు కావాలని సూచించారు. రసీదుతో పాటు మెడికల్ రిపోర్టులు, స్కాన్, ఎక్స్‌రే, ఆధార్ పత్రాలు తీసుకొని రావాలని కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



నిజామాబాద్ అర్బన్: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం జరిగిన జనరల్ ప్రయోగ పరీక్షలకు 1,045 మంది విద్యార్థులకు 1,002 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,489 మందికి 1,193 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జనరల్‌లో 689మందికి 664 మంది, ఒకేషనల్‌లో 1,372 మంది విద్యార్థులకు 1,170 మంది పరీక్షలకు హాజరయ్యారు. డీఐఈవో రఘురాజ్ ఐదు కేంద్రాలను పరిశీలించారు.

వన్యప్రాణుల బాధితులకు పరిహారం



ఇందల్వాయి: ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో చిరుత పులి దాడుల్లో పశువులను కోల్పోయిన నలుగురికి అటవీ శాఖ తరపున పరిహారం అందజేశారు. రేంజ్ కార్యాలయంలో బాధితులకు గురువారం రూ.97,500 పరిహారాన్ని అందించినట్లు ఎఫ్ఆర్వో రవి మోహన్ భట్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణుల దాడుల్లో పెంపుడు పశువులు చనిపోతే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించి పరిహారం పొందాలని సూచించారు. అంతేగాని వన్యప్రాణులకు హాని కలిగించొద్దన్నారు. డీఆర్వో శ్రీనివాస్, సెక్షన్ అధికారులు ఆనంద్, బాపురావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ టోర్నీకి నిఖత్



నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో పాల్గొననుంది. ఈ టోర్నీ బల్గేరియాలో ఈ నెల 2 నుంచి 12 వరకు జరగనుంది. ఇందులో ఆమె 50 కేజీల విభాగంలో తలపడనున్నారు. ఆమె విజయం సాధించాలని జిల్లాకు చెందిన క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

మిశ్రమ స్పందన

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వచ్చింది. గల్ఫ్ పాలసీ, ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ కొత్త రైల్వేలైన్‌పై ప్రస్తావన లేకపోవడం వలన కార్మిక కుటుంబాల్లో, ఆయా ఉమ్మడి జిల్లా వాసుల్లో నిరుత్సాహం నింపింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రెండు కోట్ల ఇళ్ల నిర్మాణ అంశం మధ్య తరగతి ప్రజలకు ఊరట నిచ్చింది. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలకు ఆయుష్మాన్ భారత్ పథకం వర్తింపు చేయనుంది. పన్ను మినహాయింపుల గురించి ప్రకటన లేకపోవడంతో వేతన జీవులు నిరాశ వ్యక్తం చేశారు.

అన్ని వర్గాలకు ప్రయోజనం




రైతులకు, ప్రభుత్వ ఉద్యోగులకు, పేదలకు, వ్యాపారులకు ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగకరంగా ఉంది. వికసిత్ భారత్ లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను పరిరక్షించే చారిత్రాత్మక బడ్జెట్. స్వయం సహాయక సంఘాల ద్వారా 3 కోట్ల మంది మహిళలను లక్షాధికారులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నరేంద్ర మోదీ పాలనలో 25 కోట్ల మంది భారతీయులకు పేదరికం నుంచి విముక్తి లభించింది. పేదలకు సొంతింటి కల నెరవేరుస్తూ వచ్చే ఐదు సంవత్సరాల్లో ఆవాస్ యోజన కింద రెండు కోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నారు. సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ వినియోగదారులకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతుంది. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలకు ఆయుష్మాన్ భారత్ పథకం వర్తింపు చేస్తారు. మౌలిక వసతుల కోసం రూ.11.11 లక్షల కోట్లు కేటాయించారు. ప్రపంచ దేశాలు ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నప్పటికీ వాటికి అతీతంగా మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి పథంలో పయనిస్తోంది.

– కులాచారి దినేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

సోలార్ గృహ విద్యుత్ దిశగా..

- కోటి ఇళ్లకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యం
- పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణం
- బాలికల్లో సర్వైకల్ క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్
- ప్రస్తావన లేని గల్ఫ్ పాలసీ.. వలస కార్మికుల్లో నిరాశ
- ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్‌పైనా ప్రస్తావనలేదు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: లోక్‌సభ ఎన్నికల ముందు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఎన్నికల తాయిలాలు అంతగా లేనప్పటికీ మధ్యతరగతి ప్రజలకు సంబంధించి నూతనంగా కోటి ఇళ్లకు రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్‌లో 300 యూనిట్లు సదరు ఇంటికి ఉచితంగా ఇచ్చాక, మిగిలిన విద్యుత్‌ను డిస్కంలకు సరఫరా చేసేలా పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా పీఎం ఆవాస్ యోజన పథకం కింద 2 కోట్ల ఇళ్లను నిర్మించేందుకు నిర్ణయించారు. 9–14 ఏళ్ల వయస్సు ఉన్న బాలికల్లో సర్వైకల్ క్యాన్సర్ రాకుండా నివారణకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. రైతులకు నానో యూరియా, డీఏపీ, ఎరువులు అందించేందుకు ప్లాన్ రూపొందించారు.

ఊసులేని గల్ఫ్ పాలసీ

ఉత్తర తెలంగాణలో అత్యధికంగా ఉన్న గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాలు ప్రత్యేక గల్ఫ్ పాలసీ కోసం డిమాండ్ చేస్తున్నాయి. అయితే దీనిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న

ఆర్మూర్ రైల్వే లైన్‌పై నిరాశ..

ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ కొత్త రైల్వేలైన్ విషయమై ప్రస్తావన లేకపోవడంతో నిరాశ వ్యక్తమవుతోంది. ఆదాయ పన్ను మినహాయింపులు గత ఏడాది మాదిరిగానే యథాతథంగా ఉంచడంతో వ్యాపారులు, ఉద్యోగులు నిట్టూరుస్తున్నారు.

సంక్షేమమే లక్ష్యంగా..



పేదలు, యువత, మహిళలు, రైతుల సంక్షేమం కోసం రూపొందించిన బడ్జెట్ ఇది. సమగ్ర వృద్ధిని సాధించి భారత్‌ను అభివృద్ధి వైపు నడిపించాలనేది ప్రధాని మోదీ ప్రభుత్వ సంకల్పం. 2047 నాటికి వికసిత్ భారత్ కల తప్పకుండా సాకారం చేస్తుంది. నారీశక్తి ద్వారా భారత్ పునాదిని బలోపేతం చేయడమే కాకుండా మహిళల స్వావలంబనను మరింత పెంచుతుంది. పంట అనంతర కార్యకలాపాలలో ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులను పెంపొందించడం ద్వారా మార్కెట్–అనుసంధానమైన ఫలితాలను అభివృద్ధి చేయడంలో సహాయ పడుతుంది. ఆత్మనిర్భర్ ఆయిల్ సీడ్స్ అభివృద్ధి చేయడం, ఆక్వా పార్కుల ఏర్పాటు, సమగ్ర డెయిరీ కార్యక్రమం ద్వారా రైతులు 2047 నాటికి వికసిత్ భారత్‌లో సమాన వాటాదారులుగా ఉంటారు. సాంకేతికంగా నిష్ణాతులైన యువతకు ప్రభుత్వం మద్దతుగా నిలుస్తోంది. 50 ఏళ్ల వడ్డీ లేని రుణంతో రూ.లక్ష కోట్ల కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయడంతో యువత పరిశోధన అభివృద్ధిని చేపట్టడానికి సహాయపడుతుంది.

– ధర్మపురి అర్వింద్, ఎంపీ

సాదాసీదా బడ్జెట్



కేంద్ర బడ్జెట్ సాదాసీదాగా ఉంది. ముఖ్యమైన మార్పులు ఏమి ప్రవేశపెట్టలేదు. కొత్త పన్ను విధానంలో స్లాబుల పెంపు, రిబేట్ ఏమీ ఇవ్వలేదు. విమానయాన రంగాన్ని దేశంలోని టూ టైర్, త్రీ టైర్ నగరాలకు, పట్టణాలకు కూడా విస్తరించాలన్న లక్ష్యాన్ని తీసుకోవడం అభినందనీయం. పునరుత్పాదక ఇంధనం అభివృద్ధిలో భాగంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు, విద్యుత్ తయారీ లాంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం సుస్థిర అభివృద్ధి వైపు అడుగులు వేయడమే. మౌలిక వసతుల కల్పనకు 11 లక్షల కోట్లు కేటాయించడం స్వాగతించవచ్చు. విద్యారంగానికి, వ్యవసాయ రంగానికి అనుకున్నంతగా కేటాయింపులు చేయలేదు.

– పాత నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెయూ

రెండు కోట్ల ఇళ్లు గాలిమాటలే..



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రెండు కోట్ల ఇళ్ల నిర్మాణం చేపడుతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. బీజేపీ ప్రభుత్వంలో గతంలో రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన విధంగానే ఇప్పుడు ఇళ్ల విషయంలో గాలి మాటలు చెప్పింది. జిల్లాలో పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేస్తారని ఇప్పటి వరకు స్పష్టత లేదు. రైతులను మభ్యపెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందడానికే పసుపు బోర్డు డ్రామా ఆడుతున్నారు.

– మానాల మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, నిజామాబాద్

వ్యవసాయ రంగానికి అనుకూల బడ్జెట్



బడ్జెట్‌లో వ్యవసాయం, రైతుల సంక్షేమానికి రూ.1.27 లక్షలు కోట్లు కేటాయించారు. వ్యవసాయ రంగంలో మరింత వృద్ధి కోసం పబ్లిక్, ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యువజన ద్వారా 2.4 లక్షల స్వయం సహాయక బృందాలు, వ్యక్తిగతంగా మరో 60 వేల మందికి రుణ సాయం అందించినట్లు చెప్పారు. రైతులకు నష్టాల నివారణ, దిగుబడి ఆదాయం పెంపు కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీంతో రైతులకు మేలు జరుగుతుంది.

– సంపత్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెయూ

నకిలీ సర్టిఫికెట్‌లతో పాస్‌పోర్టులు!

జిల్లాలో ఎస్‌బీ ఏఎస్సై అరెస్ట్‌తో కలకలం

ఖలీల్‌వాడి: జిల్లాలో నకిలీ సర్టిఫికెట్‌లతో పాస్‌పోర్టులు జారీ కావడం, ఇందులో ఎస్‌బీ ఏఎస్సై లక్ష్మణ్ అరెస్ట్ కావడం చర్చనీయాంశంగా మారింది. మూడేళ్ల క్రితం బోధన్‌లో ఒకే ఇంటి అడ్రస్‌పై 70 పాస్‌పోర్టులు జారీ అయ్యాయి. ఈ ఘటనలో ఎస్‌బీ ఎస్సై అరెస్టయ్యారు. తాజాగా నకిలీ సర్టిఫికెట్లతో పాస్‌పోర్టుల వ్యవహారంలో వెలుగు చూసింది. ఇందులో భీమ్‌గల్‌కు చెందిన సుభాష్, ఎస్‌బీ ఏఎస్సై లక్ష్మణ్‌ను సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకోవడంతో ఎస్‌బీలో కలకలం రేపుతుంది. లక్ష్మణ్‌ను విచారించిన అధికారులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనల్లో ఎస్‌బీ పోలీసులు ఉండటంతో నకిలీ సర్టిఫికెట్లతో పాస్‌పోర్టులు జిల్లాలో పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఈసీఎస్‌ఆర్ పాస్‌పోర్టు కోసం..

పాస్‌పోర్టులను రెండు రకాలుగా జారీ చేస్తారు. ఈసీఆర్ పాస్‌పోర్టును ఆధార్‌కార్డు ద్వారా తీసుకుంటారు. ఇది లేబర్ వీసాలకు మాత్రమే వర్తిస్తుంది. ఈసీఎస్‌ఆర్ పాస్‌పోర్టుకు తప్పని సరిగా విద్యార్హతలు పెట్టాల్సి ఉంటుంది. బతుకు దెరువు కోసం జిల్లా నుంచి ఎక్కువగా గల్ఫ్ దేశాలకు వెళ్తారు. అయితే వీరిలో కొందరికి ఎడ్యుకేషన్ లేకపోవడంతో వర్క్ వీసా రాదని భావించి బ్రోకర్లు, పాస్‌పోర్టు ఏజెంట్‌లను ఆశ్రయిస్తున్నారు. వారు అన్ని సర్టిఫికెట్లతో ఈసీఎస్‌ఆర్ పాస్‌పోర్టు ఇప్పిస్తామని రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు.



పాస్‌పోర్టు ఆఫీస్‌లో వెరిఫికేషన్ అయిన తర్వాత ఎస్‌బీ పోలీసులతో బేరసారాలు చేసుకొని పాస్‌పోర్టులు ఇప్పిస్తున్నారు.

వెలుగులోకి కీలక విషయాలు

నకిలీ సర్టిఫికెట్‌లతో పాసుపోర్టుల తయారీ వ్యవహారంలో సీఐడి అధికారులకు కీలక విషయాలు తెలిశాయి. దరఖాస్తుదారుడి ఆధార్ కార్డు, ఓటరు ఐడీ కార్డు, పదో సర్టిఫికెట్‌లను కంప్యూటర్‌లో మార్పులు చేర్పులు చేసి వాటిపై పాఠశాలకు సంబంధించిన స్టాంపులను నకిలీవి చేయించి అతికించారు. ఇది కోరుట్ల, హైదరాబాద్ కేంద్రంగా జరిగి నట్లు అధికారులు గుర్తించారు.

ఎంక్వైరీ పేరిట వసూళ్లు..

వెరిఫికేషన్‌కు సమయంలో పోలీసులు దరఖాస్తుదారుడి వద్ద రూ.వెయ్యి నుంచి రూ.ఐదు వేల వరకు వసూలు చేస్తారని ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు తీసుకొని నామమాత్రంగా వెరిఫికేషన్ చేస్తారనే విమర్శలు ఉన్నాయి.

ఒక్కొక్కరికి రెండు జీపీలు

- పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించిన ప్రభుత్వం
- తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని ఆదేశం



సుభాష్‌నగర్: గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. గెజిటెడ్, సూపరింటెండెంట్ హోదా కలిగిన అధికారులనే నియమించారు. ఈ క్రమంలో కొందరికి రెండు గ్రామ పంచాయతీల బాధ్యతలను అప్పగించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేకాధికారుల నియామక ప్రక్రియ పూర్తిచేశారు. ప్రభుత్వ ఆదేశానుసారం తక్షణమే ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

272 మంది అధికారులకు..

జిల్లాలో 530 గ్రామపంచాయతీలు ఉండగా గెజిటెడ్, సూపరింటెండెంట్ స్థాయి కలిగిన 272 మందిని ప్రత్యేకాధికారులుగా నియమించారు. మొదట గెజిటెడ్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, హెచ్ఎంలను ప్రత్యేకాధికారులుగా నియమించాలని జాబితాను పంపించారు. కానీ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో చివరి నిమిషంలో మార్పులు చేశారు. కేవలం గెజిటెడ్, సూపరింటెండెంట్ స్థాయి అధికారులను మాత్రమే నియమించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతో ఎంపీడీవోలు మరో జాబితాను సిద్ధం చేసి కలెక్టర్, డీపీవోలకు పంపించారు. ఒక్కో అధికారికి రెండేసి పంచాయతీల బాధ్యతలు అప్పగించారు.

రెండ్రోజుల్లో రికార్డులు, డిజిటల్ కీ..

ప్రస్తుత పాలకవర్గం నుంచి రికార్డులు, డిజిటల్ కీలను రెండ్రోజుల్లో ప్రత్యేకాధికారులు స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రత్యేకాధికారులు తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. చెక్ పవర్ ప్రత్యేకాధికారితోపాటు పంచాయతీ కార్యదర్శికి ఇచ్చారు. కాగా పంచాయతీ అధికారాలు, బాధ్యతలు, విధులు గురించి ఫిబ్రవరి 3న వారికి శిక్షణ ఇవ్వనున్నారు.

నిధుల కొరత

జిల్లాలోని పంచాయతీలకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.60కోట్ల వరకు 15వ ఆర్థికసంఘం, స్టేట్ ఫైనాన్స్ నుంచి రావాల్సి ఉంది. ప్రస్తుతం జీపీలకు నిధుల కొరత తీవ్రంగా ఉంది. ప్రత్యేకాధికారులు, కార్యదర్శుల పాలనకు నిధుల కొరత తోడైతే సమస్యలు పేరుకుపోయే ఆస్కారముంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు నిధులు సకాలంలో జమ కాకపోయినా.. సర్పంచులు సొంత డబ్బులతో పనులు చేయించారు. కానీ ప్రస్తుతం జీపీల్లో నిధులు నిండుకున్న నేపథ్యంలో తక్షణ సమస్యల పరిష్కారం, కార్మికుల వేతనాలు, ఇతరత్ర అవసరాలకు నిధులు ఎక్కడి నుంచి తీసుకొస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

జింక్ కొంటేనే యూరియా!

- జిల్లాలో డీలర్ల ఇష్టారాజ్యం
- రైతులను నిలువుదోపిడీ చేస్తున్న వ్యాపారులు
- 'మాములుగా' వ్యవహరిస్తున్న వ్యవసాయ శాఖ

గంగారాం అనే రైతు ఇటీవల జిల్లాలోని ఒక డీలరు వద్దకు వెళ్లాడు. ఒక బస్తా యూరియా కావాలని అడిగాడు. యూరియా కావాలంటే ఒక జింక్ ప్యాకెట్ తప్పనిసరిగా కొనాలని వ్యాపారి స్పష్టం చేశారు. నాకు జింక్ అవసరం లేదని రైతు చెప్పగా, యూరియా లేదని డీలరు కరాఖండిగా చెప్పాడు. దీంతో వేరే గతిలేక యూరియాతో పాటు జింక్‌ను కూడా కొనుగోలు చేశాడు. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా చాలామంది వ్యాపారులు యూరియాతో పాటు ఇతర మందులను కూడా బలవంతంగా రైతులకు అంటగడుతున్నారు.

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయించే వ్యాపారులు రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల అండ ఉందనే ధీమాతో నిబంధనలకు విరుద్ధంగా యూరియా అమ్మకాలు జరుపుతున్నారు. యూరియా కావాలంటే 'జింక్' ప్యాకెట్లు కూడా తీసుకోవాల్సిందేనని రైతులకు స్పష్టం చేస్తున్నారు. లేకపోతే యూరియా లేదని చెబుతున్నారు. దీంతో వేరే గతిలేక, అవసరం లేకున్నా 'జింక్'ను కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 480కి పైగా ఫర్టిలైజర్స్, 600 వరకు సీడ్స్, 350కి పైగా పెస్టిసైడ్స్ దుకాణాలు లైసెన్సులు కలిగి ఉన్నాయి. వీటిలోనే పంట పొలాలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతులు కొనుగోలు చేస్తున్నారు. అయితే, వ్యాపారులు అడ్డదారులు తొక్కకుండా వ్యవసాయాధికారులు వీటిని పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కానీ కొంతమంది అధికారులే వీరికి కొమ్ముకాస్తుండడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రైతులు తీసుకునే యూరియాకు జింక్‌ను అంటగట్టడమే కాకుండా నాణ్యతలేని ప్రైవేటు కంపెనీల విత్తనాలు, మందులు ఎక్కువ ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అదే విధంగా బస్తాలకు బదులు రైతులు బయో యూరియాను తీసుకునేలా ప్రోత్సహించడంలో ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదు. యూరియాను పొలాల్లో చల్లడంతో నేలకు నష్టం జరగడంతో పాటు వాతావరణం దెబ్బతినే అవకాశం ఉంది. యూరియా గుళికల రూపంలో కాకుండా ద్రవరూపంలో తయారు చేసిన బాటిళ్లు మార్కెట్లోకి వచ్చి చాలా రోజులవుతోంది. దీనిని వినియోగిస్తే నేలకు, పంటకు మంచిదని పరిశోధనలు చెబుతున్నాయి.



సీజన్ వారీగా ముడుపులు..

ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను విక్రయించే దుకాణాలు జిల్లాలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అర్హతను చూసి అడిగిన వారందరికీ వ్యవసాయ శాఖ లైసెన్సులు ఇస్తోంది. అయితే, లైసెన్సులు పొందాలంటే కూడా మండల, డివిజన్, జిల్లా స్థాయిలో అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పాల్సిందే. ఇదిలా ఉండగా, సీడ్స్, ఫర్టిలైజర్స్ దుకాణాలకు ఏడాదికోసారి లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ సమయంలో కూడా డీలర్లు అధికారులను ప్రసన్నం చేసుకుని వారి మన్ననలను పొందుతున్నారు. అదే విధంగా పట్టణాలు, మండలాలు, గ్రామ స్థాయిలో ఉండే దుకాణాల్లో వ్యాపారులు తమకు నచ్చిన విధంగా విక్రయాలు చేసుకోవడానికి ఖరీఫ్, రబీ సీజన్ల వారీగా భారీగానే ముడుపులు అప్పజెబుతూ వస్తున్నారు. దీంతో అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఒకవేళ ఫిర్యాదులు అందినా కూడా తూతూ మంత్రంగానే చర్యలు తీసుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

రైతులు కొనుగోలు చేస్తున్న యూరియా బస్తాలతో పాటు జింక్ ప్యాకెట్లు తీసుకోవాలని నిబంధన ఎక్కడా లేదు. డీలర్లు, వ్యాపారులు ఈ విధంగా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అడ్డదారులు తొక్కిన వారికి అధికారులు సహకరిస్తే ఉపేక్షించేది లేదు. రైతులకు బయో యూరియాను ప్రోత్సహించాలి. – వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయ అధికారి

ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు



కిషన్‌రెడ్డికి దరఖాస్తు అందజేస్తున్న జ్ఞానేందర్ గుప్తా



రేవంత్‌రెడ్డితో ఆకుల లలిత

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ లోక్‌సభ ఎంపీ బీజేపీ టికెట్ కోసం నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారస్తుడు, మంచాల శంకరయ్య గుప్తా ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మంచాల జ్ఞానేందర్ గుప్తా దరఖాస్తు చేసుకున్నారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డిని కలిసి దరఖాస్తు అందించారు. గత పదేళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్న తనకు పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరారు. జ్ఞానేందర్ గుప్తాతో పాటు ఎస్సీ కమీషన్ మాజీ సభ్యుడు కేశపల్లి రాములు, మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

సీఎంను కలిసిన ఆకుల లలిత

ఖలీల్‌వాడి: హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత మర్యాదపూర్వకంగా కలిశారు. నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా తనను పరిగణించాలని ఆమె కోరారు. అనంతరం ఆమె గాంధీభవన్‌లో నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా తన పేరును దరఖాస్తు చేసుకున్నారు. ఆమె వెంట గడీల రాములు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ధర్పల్లి మాజీ ఎంపీపీ గోపి..

ఇందల్వాయి: నిజామాబాద్ ఎంపీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని ధర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమ్మడి గోపి కోరారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి శరత్ గౌడ్‌కి ఎంపీ టికెట్ కోసం గురువారం ఆయన దరఖాస్తు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. తెలంగాణలో అన్ని ఎంపీ సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు.

క్లుప్తంగా

హైదరాబాద్‌లో ఆల్ ఇండియా నర్సరీ మేళా

డొంకేశ్వర్(ఆర్మూర్): హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో ఈ నెల 1వ తేదీ నుంచి 5 వరకు ఆల్ ఇండియా నర్సరీ మేళా జరగనుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నర్సింగ్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో దేశం నలుమూలల నుంచి 140కి పైగా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. పూలు, పండ్ల రకాల మొక్కలను ప్రదర్శనలో ఉంచుతున్నట్లు వివరించారు. జిల్లా వాసులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గురుకుల పాఠశాల విద్యార్థిని నేహ జాతీయస్థాయి అండర్–14 స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగీత గురువారం తెలిపారు. ఈ నెల 3 నుంచి 7వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో నేహ పాల్గొంటుందన్నారు. అనంతరం విద్యార్థిని నేహను ప్రిన్సిపాల్ సంగీత, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, పీఈటీ జ్యోత్స్న, హౌస్ టీచర్ చెన్నకేశ్వరి తదితరులు అభినందించారు.

ముగిసిన విద్యుత్ స్తంభం పరీక్షలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని పవర్‌హౌస్‌లో నిర్వహిస్తున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూనియర్ లైన్‌మన్ అభ్యర్థుల విద్యుత్ స్తంభం పరీక్షలు గురువారం ముగిశాయి. ఈ పరీక్షలను విద్యుత్‌శాఖ సీజీఎం మధుసూదన్ పరిశీలించారు. 33మంది అభ్యర్థులకు 32 మంది స్తంభం ఎక్కగా ఒక్కరు గైర్హాజరయ్యారు. డీఈటీ వెంకటరమణ, డీఈలు సాలియానాయక్, అధికారులు ఉన్నారు.

కొటార్మూర్‌లో సర్వే పరిశీలన

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్ నుంచి చేపట్టనున్న 63వ నంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేపడుతున్న సర్వేను అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి గురువారం పరిశీలించారు. ఆర్మూర్ నుంచి మోర్తాడ్ మండలం వరకు ఆర్డీవో వినోద్ కుమార్‌తో కలిసి సర్వే పరిశీలన చేపట్టారు. సర్వే త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సర్వే అండ్ ల్యాండ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శికారి రాజు, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

కేంద్ర బడ్జెట్ మధ్య తరగతిని ఆకట్టుకునేలా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బస్తీల్లో ఉంటున్న వారికి సొంత ఇళ్లు కట్టుకునేందుకు కొత్త పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో గురువారం వెల్లడించారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా బడ్జెట్‌పై పలువురు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.



ఎన్నికల కోసమే బడ్జెట్



కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కోసమే బడ్జెట్ ప్రవేశపెట్టింది. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు లాభం లేదు. ఎన్నికల్లో లబ్ధి పొంది మళ్లీ అధికారంలోకి రావడానికి అంకెల గారడీ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించలేదు.

– సుధాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి, నిజామాబాద్

ప్రజల ఆశలపై నీళ్లు



ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సామాన్య మధ్య తరగతి ప్రజానీకాన్ని తీవ్ర నిరాశకు గురి చేసింది. ఎలాంటి ధరల తగ్గింపు ప్రస్తావన చేపట్టలేదు. కేంద్ర బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్న సామాన్య ప్రజల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

– రమేశ్‌బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి, నిజామాబాద్

షుగర్ ఫ్యాక్టరీల ఊసేలేదు



బోధన్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో షుగర్ ఫ్యాక్టరీల ఊసేలేదు. ఫ్యాక్టరీల అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్న కేంద్రం మాట తప్పింది. ఇథనాల్ ఫ్యాక్టరీలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించారు.

– ఉపేందర్, మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి

అభివృద్ధి దేశంగా భారత్..



ఆర్మూర్: 2047 నాటికి పేదరికం కనబడకుండా చేయాలన్న లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించడం అభినందనీయం. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఈరవత్రి రాజశేఖర్, చార్టెడ్ అకౌంటెంట్, ఆర్మూర్

ఇక పల్లెలు ప్రగతివైపు..



ఆర్మూర్: గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.ఒక లక్ష77 వేల కోట్లు కేటాయించడంతో పల్లెలు ప్రగతి వైపు పయనిస్తాయి. ఈ నిధులను పూర్తి స్థాయిలో గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– గుండోజి నరేందర్, ఉపాధ్యాయుడు, ఆర్మూర్

కరెంటు కష్టాలు లేని దేశంగా..



ఆర్మూర్: కరెంటు కష్టాలు లేని దేశ నిర్మాణానికి కట్టుబడ్డ కేంద్రం దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లపై రూఫ్ టాప్ సోలార్ సెటప్స్ ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం శుభపరిణామం. ప్రతీ కుటుంబానికి ఏడాదికి రూ.15 వేలు ఆదా అవుతుంది.

– రమేశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్మూర్

పసుపు బోర్డు ప్రస్తావన లేదు



ఆర్మూర్: జిల్లా రైతాంగం పసుపు బోర్డుపై ఎన్నో ఆశలు పెట్టుకుంది. కేంద్ర ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పసుపు బోర్డు ప్రస్తావన లేకపోవడం విచారకరం. కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపుపై పునరాలోచన చేయాలి.

– పెద్దకాపు రాజు, రైతు, పెర్కిట్

మధ్యతరగతికి మొండి చేయి



నిజామాబాద్‌నాగారం: పేద, మధ్యతరగతి ప్రజలను మోసం చేసేలా కేంద్ర మధ్యంతర బడ్జెట్ ఉంది. ఆదాయపు పన్ను రూ. 10 లక్షల వరకు మినహాయింపు ఇస్తారని మధ్యతరగతి వర్గం ఆశించిందని కానీ ఎలాంటి మార్పులు లేకుండా మొండి చేయి చూపింది.

– రామ్మోహన్‌రావు, పింఛన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

వీవోఏలకు 'గుర్తింపు' కార్డులు

డొంకేశ్వర్: ఐకేపీలో పని చేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు (వీవోఏ) ఇటీవల వేతనాలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా వారికి 'గుర్తింపు' కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. రాష్ట్ర సెర్ప్ శాఖ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఉన్న వీవోఏలకు ట్యాగ్‌తో కూడిన గుర్తింపులు కార్డులు జారీ చేస్తున్నారు. వీటిని తయారు చేసేందుకు అయ్యే ఖర్చును ఆయా మండల సమాఖ్యల నుంచి చెల్లించాలని ఆదేశాలు ఉన్నాయి. మండలాల్లోని ఏపీఎంలు వీవోఏలకు గుర్తింపు కార్డులను అందజేయడానికి వారి ఫొటోలు, వివరాలు సేకరించారు. ఇప్పటికే పలు మండలాల్లో పంపిణీ కూడా పూర్తయింది. జిల్లాలో 806 మంది వీవోఏలు ఉండగా, వీరు గ్రామ సంఘాలను నిర్వహించి రుణాల మంజూరు, రికవరీతో పాటు రికార్డుల నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. ఐతే, ఈ గుర్తింపులు కార్డులు వీలైనంత త్వరగా వీవోఏలకు అందజేస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ నాయక్ 'సాక్షి'కి తెలిపారు.



గుర్తింపు కార్డులు అందజేస్తున్న అధికారులు

విద్యార్థులకు అభినందన



కామారెడ్డి అర్బన్: పట్టణానికి చెందిన ఆర్కిడ్స్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్ గోవర్ధన్‌రెడ్డి గురువారం తెలిపారు. విద్యార్థులు వి.మధుప్రియ, వై.మనీష్ రాష్ట్ర స్థాయి రగ్బీకి ఎంపికైయ్యారని, పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

సేవలోనే సంతృప్తి

- జీజీహెచ్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తూనే రెగ్యులర్ ఉద్యోగాలు
- నర్సింగ్ ఆఫీసర్ల మనోగతం..

నిజామాబాద్‌నాగారం: నర్సింగ్ వృత్తిలో ఉన్న వారికి అది ప్రభుత్వ ఉద్యోగమైనా.. ప్రైవేటైనా అంతులేని సంతృప్తిని మిగులుస్తుంది. రోగికి సేవ చేయడమే తమకు దక్కిన అదృష్టమని భావిస్తూ ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తారు నర్సింగ్ ఆఫీసర్లు. ప్రేమ, సేవ కలగలిసిన వృత్తిలో కొనసాగడానికి మించిన సంతృప్తి ఇంకేముంటుందని అంటున్నారు. ఇటీవల జిల్లాలో 380 మంది నర్సింగ్ ఉద్యోగాలు సాధించగా, జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న 104 మంది వారిలో ఉన్నారు. జీజీహెచ్‌లో మొత్తం 120 మంది కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తుండగా, 104 మంది రెగ్యులర్ ఉద్యోగాలు సాధించారు. ఓ పక్క ప్రభుత్వ దవాఖానలో విధులు నిర్వర్తిస్తూనే.. నిరంతర శ్రమ, పట్టుదల, రోగులకు సేవ చేయాలనే తపనతో నర్సింగ్ ఆఫీసర్లుగా రెగ్యులర్ ఉద్యోగాలు సాధించిన వారి మనోగతం ఇలా..

నా భర్త, నేను కలిసి సాధించాం



ప్రభుత్వ ఉద్యోగం సాధించానికి చాలా కష్టపడ్డాను. ఒక పక్క కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తూనే మరో పక్క చదువుకున్నాను. ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యంతో ముందుకు వెళ్లాను. ఆలస్యంగానైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది. నేను నా భర్త కలిసి సాధించడం చాలా సంతోషంగా ఉంది.

– రెహానా బేగం, నర్సింగ్ ఆఫీసర్

అనుకున్నది సాధించాను



నేను కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగంలో చేరాను. అయినా వచ్చే జీతం తక్కువ కావడంతో కుటుంబం నడవడం చాలా కష్టంగా ఉండేది. పెరిగిన ధరలకు చేతికందే జీతం సరిపోయేది కాదు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదివి అనుకున్నది సాధించాను. రోగులకు సేవ చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగం సాధించడం గర్వంగా ఉంది.

– భరత్ రాహుల్‌రాజ్, నర్సింగ్ ఆఫీసర్

ప్రాణాలకు తెగించి సేవ చేశా



కాంట్రాక్ట్ ప్రాతిపదికన 2017లో ప్రభుత్వ దవాఖానలో ఉద్యోగంలో చేరా. కొవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించా. నా ప్రాణాలను, కుటుంబాన్ని రిస్క్‌లో పెట్టి విధులకు హాజరయ్యా. విధులు నిర్వహిస్తూనే మరో పక్క హార్డ్‌వర్క్ చేశాను. కుటుంబ సహకారంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాను.

– రజిని, నర్సింగ్ ఆఫీసర్

రోగులకు సేవ చేయడం అదృష్టం



నర్సింగ్ విద్యను ఎక్కువగా అమ్మాయిలే అభ్యసిస్తారు. ఈ రంగంలో బాలురు తక్కువగా ఉంటారు. రోగులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. అందుకే అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ అని ఆలోచించకుండా రోగులకు సేవలందించా. నర్సింగ్ విద్యను పూర్తి చేసి కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగం సాధించాను.

– సతీశ్, నర్సింగ్ ఆఫీసర్

ఓ వైపు పిల్లలు మరోవైపు ఉద్యోగం



నేనూ నా భార్య ఇద్దరం ఉద్యోగాలు సాధించాం. మాకు ఇద్దరు పిల్లలున్నారు. ఇద్దరం ఉద్యోగం చేస్తూ, పిల్లలను చూసుకుంటూ చదువుకున్నాం. ఇద్దరికీ ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. నా భార్య రెహానాబేగం కామారెడ్డి జిల్లాకు, నేను నిజామాబాద్‌కు వస్తాము. పోస్టింగ్ ఎక్కడైనా ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది.

– ఉమేర్, నర్సింగ్ ఆఫీసర్

పదో తరగతి పరీక్షలకు సిద్ధం కావాలి

- డీఈవో దుర్గా ప్రసాద్

బోధన్: పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు సిద్ధం కావాలని డీఈవో దుర్గా ప్రసాద్ హెచ్‌ఎంలను ఆదేశించారు. వార్షిక పరీక్షలు మార్చి 18 నుంచి 31 వరకు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. పదోతరగతి పరీక్షల నిర్వహణపై గురువారం పట్టణ కేంద్రంలోని డిప్యూటీ డీఈవో ఆఫీసులో డివిజన్ స్థాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. డ్రాఫ్ అవుట్స్ విద్యార్థులు లేకుండా హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో నోడల్ ఆఫీసర్ వనిత, ప్లానింగ్ కో–ఆర్డినేటర్ శ్రీధర్, సీఎంవోలు శ్రీనివాస్, జీవన్, ఎంఈవోలు నాగ్‌నాథ్, శాంతకుమారి, రామారావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో దుర్గా ప్రసాద్

క్రైం కార్నర్

రైలు కింద పడి వృద్ధురాలి మృతి



నవీపేట: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు కిందపడి స్టేషన్ ఏరియాకు చెందిన రత్నావత్ శృతి అలియాస్ గుండిబాయి(60) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్ గురువారం తెలిపారు. కాచిగూడ నుంచి నాగర్‌సోల్‌కు వెళ్తున్న రైలులో తినుబండారాల ప్యాకెట్లు విక్రయించే వృద్ధురాలు ఒక బోగీ నుంచి మరో బోగీలో ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి రైలు కిందపడి మృతి చెందిందన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..



బీబీపేట: బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని యాడారంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సంఘమేశ్వర్(46) మూడు రోజుల క్రితం బీబీపేటకు వచ్చి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మోపాల్: మండలంలోని కంజర్ శివారులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. గురువారం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కంజర్ గ్రామానికి చెందిన పిల్లి భూమారావు మోపాల్ నుంచి వస్తుండగా, కులాస్‌పూర్‌కు చెందిన పసుల శేఖర్ తన భార్య, చిన్నమ్మతో మోపాల్ వైపు వస్తుండగా కంజర్ శివారులో బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో శేఖర్, ఆయన భార్య, చిన్నమ్మకు గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై గంగాధర్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రూ.1.50 లక్షలకు టోకరా..

కామారెడ్డి క్రైం: సైబర్ మోసాలపై పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా ఏదో చోట జరుగుతూనే ఉంది. మోసగాళ్లు కొత్తదారుల్లో వస్తూ డబ్బులు కాజేస్తున్నారు. ఇలాంటిదే పట్టణంలో గురువారం వెలుగు చూసింది. భాను ప్రకాశ్ అనే వ్యక్తికి రెండు రోజుల క్రితం ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ ఐసీసీఐ క్రెడిట్ కార్డుకు సంబంధించిన ఇంటర్‌నేషనల్ ట్రాన్సాక్షన్ ఆన్‌లో ఉందన్నాడు. ఆఫ్ చేయాలంటే తాను చెప్పిన విధంగా చేయాలన్నాడు. అతను చెప్పినట్టూల్ల ప్లేస్టోర్‌లో ఐ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని క్రెడిట్ కార్డు వివరాలు ఇవ్వగానే అతని అకౌంట్‌లో నుంచి రూ.1.50 లక్షలు కట్ అయ్యాయి. మోసపోయినట్లు గుర్తించి పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

బస్సులో బంగారం చోరీ

ఎడపల్లి/బోధన్ టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గుండ్లు చోరీకి గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. డిచ్‌పల్లి మండలం రాంపూర్‌కు చెందిన పోసాని రుద్రూర్‌లో బంధువుల శుభాకార్యం నిమిత్తం గురువారం వెళ్లింది. తిరుగు ప్రయాణంలో బోధన్ బస్టాండ్‌లో నిజామాబాద్‌కు వచ్చే బస్సు ఎక్కింది. బస్సు ఎక్కినప్పుడు మెడలో ఉన్న రెండు తులాల బంగారు గుండ్లు ఎడపల్లి ప్రాంతంలో చూసే సరికి కనిపించలేదు. దీంతో బాధితురాలు డ్రైవర్, కండక్టర్‌కు చెప్పడంతో వారు బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ప్రయాణికులను తనిఖీ చేయగా బంగారం లభించలేదు. దీంతో బాధితురాలిని బోధన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.



బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

మహిళల సొమ్ము హాంఫట్..

- రూ. 6 లక్షల సొమ్ము కాజేసిన కెనరా బ్యాంక్ కరస్పాండెంట్

వర్ని: డ్వాక్రా సంఘం మహిళలు ప్రతి నెలా జమ చేస్తున్న రూ. 6లక్షల60వేల నగదును ఓ ప్రబుద్ధుడు తనదైన శైలిలో హాంఫట్ చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సైదిమల్ గ్రామానికి చెందిన జైభవాని గ్రూపు సభ్యులు 25 నెలలుగా గ్రామంలో ఏర్పాటు చేసిన కెనరా సర్వీస్ బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తున్నారు. ఈ సర్వీసు బ్యాంక్‌ను అదే గ్రామానికి చెందిన కృష్ణ నిర్వహిస్తుండగా అతనికి గత 25 నెలలుగా సంఘ సభ్యులు నగదును అందజేస్తున్నారు. వారికి నామమాత్రపు రసీదులు ఇచ్చి నగదు బ్యాంకులో జమ అయిందని చెప్పేవాడు.


ఈ విషయమై బ్యాంకులో సభ్యులు విచారణ చేయగా ఖాతాలో జీరో బ్యాలెన్స్ ఉండడంతో కృష్ణను ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రూప్ రెండో లీడర్ వడ్ల బాలమణి, సభ్యులు తెలిపారు.

కొరట్‌పల్లి తండాలో ఇద్దరి అరెస్ట్



ఆర్మూర్‌టౌన్: డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లి తండాలో సారా కాస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ గురువారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించగా సారా, బెల్లం పానకం లభ్యమైనట్లు చెప్పారు. నిషేధిత సారా కాస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆయన వెంట ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బేకరీలో కుళ్లిన కేక్‌లు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని డాల్ఫిన్ బెంగళూరు బేకరీలో కుళ్లిన కేక్‌లు విక్రయిస్తుండడంతో పలువురు ఆందోళనకు దిగారు. గురువారం పుట్టినరోజు వేడుకల కోసం ఓ కస్టమర్ బేకరీ నుంచి కేక్ తీసుకెళ్లాడు. అది తిన్న బాధితులకు వాంతులయ్యాయి. ఈ విషయమై బేకరీ నిర్వాహకుడిని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు బాధితులు తెలిపారు. ఆర్మూర్ ఇన్‌చార్జి కమిషనర్ భూమేశ్వర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌కు ఫిర్యాదు చేయడంతో వారు కుళ్లిన కేకులను పరిశీలించారు. తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

రాజంపేట: డ్రంకన్ డ్రైవ్‌లో మండల కేంద్రానికి చెందిన మ్యాదరి లక్ష్మణ్‌కు రెండో తరగతి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష, రూ. 200 జరిమానా విధించినట్లు ఎస్సై సంపత్ గురువారం తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని అన్నారు.

అనుమానితుల పట్టివేత

తాడ్వాయి: మండలంలోని కన్కల్ గ్రామంలో భిక్షాటన పేరిట తిరుగుతున్న నలుగురు అనుమానిత మహిళలను గ్రామస్తులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు గురువారం తరలించారు. ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన వీరు గ్రామంలో బియ్యం, నగదు పేరిట భిక్షాటన చేస్తున్నారు. వీరి ప్రవర్తపై అనుమానం వచ్చిన గ్రామస్తులు వారిని నిలదీశారు. మీరు భిక్షాటన కోసం రాలేదని చిన్నపిల్లలను దొంగిలించేందుకు వచ్చారంటు వారిని పట్టుకొని పీఎస్‌కు తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కామారెడ్డి క్రైం: పట్టణంలోని పెద్ద బజార్‌లో ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన ఫర్హానా బేగం బుధవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి పిల్లలతో పక్క కాలనీలో ఉండే తల్లిగారి ఇంటికి వెళ్లింది. గురువారం సాయంత్రం వచ్చి చూసేసరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. 2 తులాల బంగారం, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితురాలు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: కోటగిరి మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక అశోక్ లేలాండ్ వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ గురువారం తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీలో పట్టుకున్నట్లు చెప్పారు. అనంతరం వాహనాలను సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు.